# అమ్మాయికి కావలసింది

-యర్రమిల్లి విజయలక్ష్మి

"ముందా కోతి వెధవల్ని పోనీయండే...!" సైకిల్ స్టాండ్ వైపు నడుస్తున్న రమ్య ఆగి అంది. "నీకు భయమేమిటి...!? వాళ్ళే అదిరి ఛస్తున్నారు నిన్ను చూస్తే...!" నవ్వుతూ కవ్వించింది దివ్య...." "భయమని కాదు... అయినా వాళ్ళ అల్లరి చిరాగ్గా వుంటుందే... ఆడపిల్లలు కనిపిస్తే చాలు వెర్రెక్కినట్టు ఈలలు... కూతలు... ఛ... మరీ చీప్‌గా వుంటుంది... ఆమాత్రం బెదురు వుండటం మనకే మంచిది... మన జోలికెవరూ రారు!" ఎల్లాగైనా ఒక్క గులాబీ పువ్వైనా తెంపుకు పోవాలని రమ్య తాపత్రయ పడుతూనే చెప్పింది. కాని గార్డెనర్ వీళ్ళకి కాస్త దూరంగా ఫౌంటెన్ దగ్గర సెటిలై రెప్ప వాల్చకుండా ఇటే చూస్తున్నాడు. ఈ గ్రూపు గార్డెన్ వైపు వచ్చినప్పుడల్లా అతనో కన్ను అటు పడేసి వుంటాడు. "అదిగో... రామయ్య నిన్నే చూస్తున్నాడు... కోస్తే పట్టేసి ప్రిన్సిపాల్‌కి రిపోర్టు చేస్తాడు. జాగ్రత్త...!" రమ్య మాటలు ఖాతరు చెయ్యకుండా తన్నే అడ్డుపెట్టుకుని చటుక్కున ఒక రోజ్ తుంపి బాగ్‌లో పడేసుకుంది. రామయ్య రెప్పమూసి తెరిచేలోగా... పడేసుకుని- అటు, ఇటు పది అడుగులు నడిచి "...పదండే ఆ ఫూల్స్‌కి భయపడి మనం లేటుగా వెళ్ళటమేమిటి?" అంది.

"మనకేం భయం అని కోశావుగా ఇప్పుడే..." దివ్య ఉడికించింది. "-భయం కాదంటే...! ఆ వెడుతున్నారు చూడు నలుగురు... అది వఠి యఊన్‌లెన్ బాచ్... వాళ్ళు నిజంగా చదువుకోవటానికేనా ఏమిటి... కాలేజీకి రావడం..." సైకిల్ కారియర్ మీద బుక్స్ బాగ్ సెట్ చేసుకుంటూ ఎవరూ వింటం లేదు కదా అని అటు ఇటు చూసి నవ్వింది. రమ్య, దివ్య, సుధ సైకిల్స్ నడిపించుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ గేటు దగ్గరికి వచ్చేసరికి ఇంచుమించు బాయ్స్ అందరూ వెళ్ళిపోయారు. కొంతమంది గర్ల్స్ కాంపస్ ఎదురుగా వున్న బస్టాప్‌లో నిలబడి సిటీ బస్ కోసం ఎదురు చూస్తున్నారు. అటు, ఇటు పెద్ద పెద్ద వృక్షాలు చలువ పందిర్లలా వున్న విశాలమైన మెయిన్ రోడ్ మీద ఆ ముగ్గురమ్మాయిలు హాయిగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ వెడుతున్నారు.

"ఏమిటే సుధా... ఏమీ మాట్లాడవు...! అయితే ఈ వీకంతా రాదా పద్మ కాలేజీకి...!?" "ఉదయం వెళ్ళినప్పుడు వాళ్ళమ్మ గారు అట్లాగే చెప్పారు రమ్య... రాత్రి నుంచి చలి, జ్వరమట... వాళ్ళ డాడీ హాస్పిటల్‌కి తీసుకెళ్ళారట... జ్వరం ఎక్కువగా వుందన్నారు... ఒకటి, రెండు రోజుల్లో నార్మల్‌కి వచ్చినా నీరసంగా వుంటుంది కదా... పాపం...!" అంది సుధ.

సుధ, పద్మ ఇద్దరూ బ్యాంక్ కాలనీ నుంచి వస్తారు కాలేజీకి. ఇద్దరు మంచి ఫ్రెండ్స్. కాలేజ్‌కి రోజూ ఇద్దరు కలిసి వచ్చి- వెడుతుంటారు. సాధారణంగా గర్ల్స్ ఇద్దరు, ముగ్గురు కలిసి కాలేజీకి వచ్చి, మళ్ళీ అల్లాగే గ్రూపుగా వెళుతుంటారు. వంటరిగా ఎవరూ కనపడరు. తిరుమలరావు పార్కు సెంటర్ దగ్గరకి వచ్చాక రమ్య, దివ్య సుధకి 'బై' చెప్పి కొత్తపేట మెయిన్ రోడ్ వైపు తిప్పారు వాళ్ళ సైకిల్స్. కాలేజీకి ఒక అరమైలు దూరంలోనే వుంది పార్క్ సెంటర్... అక్కడ్నించి వాళ్ళిద్దరూ ఓంకార క్షేత్రం దాటి ఐ.టి.సి. కాలనీలోకి వెళ్ళాలి. తనింకా రెండు మైళ్ళు వెళ్ళాలి. వాళ్ళకి 'టా...టా...' చెప్పి తిన్నగా మెయిన్ రోడ్ మీద స్పీడు పెంచి పోతోంది సుధ. సాయంత్రం చెట్ల నీడ వల్ల మరింత చల్లగా మబ్బు మబ్బుగా వుంది. రోడ్డు మీద అప్పుడప్పుడు అటు ఇటు పోతున్న రిక్షాలు- ఒకటి రెండు వెహికల్స్ తప్ప పెద్దగా రద్దీలేదు. కోర్టు సెంటర్ దాకా వచ్చి వాచ్‌లో టైం చూసుకుంది. పది నిమిషాల్లో వచ్చేసింది. రోజూ పద్మతో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ పోతుంటే టైమే తెలియదు. ఎన్ని మైళ్ళన్నా సైకిల్ మీద శ్రమ అలుపు లేకుండా వెళ్ళిపోవచ్చు. చూస్తుండగానే ఇట్టే ఇల్లొచ్చేస్తుంది. పద్మకు జ్వరం తగ్గి కాలేజీకి వచ్చే వరకూ తనిల్లా వంటరిగా వెళ్ళాల్సిందే... ఆలోచిస్తూనే సుధ

కుందేరు వంతెన దగ్గరకి వచ్చేసంది. కోర్టు దగ్గర్నించి- కుందేరు దాటి- జాయిస్ ఇంగ్లీషు మీడియం కాన్వెంటు దగ్గర స్మశానం దాటి- ఇంకాస్త ముందుకు పోతే కానీ జన సంచారం వుండదు. రోజూ కుందేరు దగ్గరకి వచ్చేసరికి అంతవరకూ నిదానంగా సరదా కబుర్లు చెప్పుకుంటూ వచ్చే పిల్లలు స్పీడు పెంచి, చకచక బాలాజీ థియేటర్ సెంటర్ చేరుకుని ఊపిరి పీల్చుకుంటారు. కుందేరంటే అంత భయం. ఆ ప్రాంతంలో జనావాసాలు కాని, షాపింగ్ సెంటర్ కాని పెద్ద ఆఫీసులు కాని లేకుండా నిర్మానుష్యంగా వుండటమే అందుకు కారణం. సాయంత్రం ఐదు దాటేసరికే చలికాలపు సాయంత్రాల్లో అటు వంటరిగా వెళ్ళాలంటే ఆడవాళ్ళు- పెద్దవాళ్ళైనా సరే జంకుతారు. కోర్టుకొచ్చి పోయే జనం కోసం- కాన్వెంటు పిల్లల కోసం రోడ్డుమీద చింతచెట్టు క్రింద వున్న సోడా బడ్డీ కొట్టు అప్పుడే మూసేసాడు. స్పీడుగా ఎత్తుగా వున్న వంతెన ఎక్కుతూ గతుక్కుమంది సుధ. అక్కడ వంతెన గోడకు సైకిల్స్ ఆన్చి నిలబడి వున్నారు నలుగురు కుర్రాళ్ళు. వాళ్ళని అక్కడ చూడగానే సుధ గుండెలో వణుకు ప్రారంభమైంది. అటు చూడకుండా తప్పుకుపోవాలనుకుంది వంతెన మీదకు సైకిల్ మీద వంటరిగా ఆదరా బాదరా వస్తున్న సుధను చూస్తూనే గందరగోళం ప్రారంభించారు. ఇద్దరు పిట్టగోడలా వున్న వంతెన గట్టుమీద ఠీవిగా బైఠాయించి సిగరెట్లు ఊదుతూ ఇకిలిస్తుంటే మరో నలుగురు సైకిల్స్ గోడకు వదిలేసి...

"ఒరేయ్... రాణీ వస్తోందిరోయ్... తప్పుకోండి... యువరాణీగారు వేంచేస్తున్నారు... దారివ్వండి..." "ఓహ్... వాట్ ఎ బ్యూటీ..."

"ఎవరీ రాణీ రా. నీ రాణీనా... నా రాణీనా."

"నో... నో... ఏ ఒక్కరి సొత్తు కాదురోయ్. భ్రమపడకు. దేశానికి రాణి. అందరికీ రాణి..." "చిక్కావు గూటిలో చిలకమ్మా... ఎక్కడికి పోతావే చిలకమ్మా-" పాట ప్రారంభించాడు.

"హిప్... హిప్... హుర్రే..." విజిల్స్... నవ్వులు... వ్యర్థ ప్రలాపాలు ప్రారంభించారు.

"రాణి కాదురా... సుధా... సుధలొలికే రాణి... సార్థక నామధేయురాలురోయ్..."

సుధకి వళ్ళంతా చెమటలు కమ్ముకొస్తున్నాయి. ఈరోజు ఈ మూక పాలపడిందేమిటి తను! తల దించుకుని గబగబ ముందుకు వాళ్ళని క్రాస్ చేసి వెళ్ళిపోవాలని ఆరాటపడుతోంది. అటు ఇటు గట్ల మీద... ముందు, వెనుక కమ్ముకున్నట్లు అల్లరి మూక కాలు సాగటం లేదు. భయంతో గుండెల్లో దడ మొదలైంది. వీళ్ళు తప్ప కనుచూపు మేర ఆ చుట్టుప్రక్కల మరో ప్రాణి లేదు. ఒకప్రక్క జీమూతంలా చీకటి కమ్ముకొస్తోంది. పొట్టి వంతెనకు అటు ఇటు చూపు సాగినంత మేర కుందేరు. బాగా ఎడంగా కాసిని గుడిసెలు- వెనక ఐఎల్‌టిడి ఆఫీసర్స్ కాలనీ బాక్‌యార్డ్. చుట్టూ అడవిలా పెరిగిన వృక్షాలు. అందరితో కలిసి వెడుతుంటే ఆనందంగా ఎంజాయ్ చేసే పరిసరాలు. ఇప్పుడు పరమ భయంకరంగా వున్నాయి. తప్పించుకు పోవటానికి సందు లేకుండా ఎటు కదిలితే అటు చుట్టుముడుతున్నారు.

"ఏం గురూ- పాపం ఇవాళ యువరాణీ వంటరిగా చిక్కిందే-"

"అవున్రోయ్... ఇవ్వాళ పాపం బాడీగార్డే మైపోయిందో."

"ఎవరూ... ప్రియా...!?"

"తప్పు తప్పు... పద్మప్రియా... కదూ బేబీ నీ ఫ్రెండ్ పేరు- భయం లేదమ్మా... చెప్పూ...!" ముఖం మీదకి సిగరెట్ పొగ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.


పట్టించుకోకుండా తప్పించుకుపోవాలని ప్రయత్నిస్తోంది. వాళ్ళ మధ్య నుంచి సైకిల్ స్పీడుగా తొక్కాలని... "ఎందుకురా అంత తొందరా... మనం మనుష్యులమేగా..."

"మీరు... మనుష్యులా." కసిగా లోలోపల పళ్ళు కొరికింది.

"పొగ పడదేమోరా... బేబీకి."

"కొరుక్కు తినేస్తామని భయమేమో."

డైరెక్టుగా నిస్సిగ్గుగా కుళ్ళు జోక్స్ పేలుస్తూ తనని ముందుకు కదలనియ్యక చుట్టూ కమ్ముకొస్తుంటే సుధ భయంతో బిగుసుకుపోయింది. ఆ అమ్మాయి వంటరిగా వుండటం- చుట్టుపక్కల వారించే వారెవరూ లేకపోవడం- నిర్మానుష్యంగా వున్న పరిసరాలు ఈ రోమియో గాంగ్‌కి పట్టపగ్గాలు లేకపోయింది. సుధకు చాలా ఎంబరేసింగ్‌గా వుంది.



కోపంగా వుంది. భయంగా వుంది. వాళ్ళు ఆరుగురు తను ఒక్కతి. ఆమె ముందుకు పోతుండటంతో సైకిల్స్ తీసుకుని ఇద్దరేసి ఎక్కేసి వెంటపడి సుధ పర్సనాలిటీ గురించి- కాంప్లెక్షన్ గురించి విచ్చలవిడిగా- నిర్భయంగా పిచ్చిగా కామెంట్ చేస్తూ పేట్రేగి పోతున్నారు. సుధ కళ్ళెత్తి అటు ఇటు చూడలేకపోతోంది. వాళ్ళ ప్రవర్తనకు మనసులో ఎంత అసహ్యించుకుంటున్నా- పైకి ధైర్యంగా "ఏమిటి... ఎందుకు నన్నిలా అల్లరి పెడుతున్నారు" అని ఎదిరించి నిలదీయటం కాని- "కంప్లయింట్ చేస్తాను... జాగ్రత్త" అని బెదిరించటం కాని చెయ్యలేకపోతోంది. ఎప్పుడెప్పుడు వంతెన దిగి- థియేటర్ సెంటర్‌కెళ్ళిపోతానా... ఈ పీడ వదులుతుందా అని భయంతో అదిరిపడుతున్న గుండెల్ని అదుపులో వుంచుకోవాలని ప్రయత్నిస్తూ త్వరత్వరగా సైకిల్ తొక్కుతోంది. "ఈ కాలేజీలు ఊరికి ఇంత దూరంగా నిర్జనారణ్యాలలో ఎందుకు కడతారో? హాయిగా ఉమెన్స్ కాలేజీలో బి.యస్సీలో

## మేం చేస్తాం...

ఎవరు చేశారు
ఎందుకు చేశారు
ఎవరికి ఏం అపకారం చేసిందని?
అలనాడు... ఒకనాడు
ప్రతి యింటిలో...
నగరంలో... ప్రతి దేశంలో...
ప్రపంచమంతా తానై వెలిగింది
భూగోళానికే వన్నె తెచ్చింది
మెడలు సాచిన
కరాళ కుటిల కూహకాలు
చివరకు తోకలు ముడిచాయి
జయం జయమ్మని కీర్తించాయి
భుజాలకెత్తుకుని మోశాయి
ఇన్నాళ్లకు... యిన్నేళ్లకు...
కాలంతో పెరిగిన వయసుతో
మీద పడిన ముసలితనంతో
ఎక్కడో... ఏ మూలో...
ఇంకా ఉన్నాను నేనంటూ
సన్నని గొంతుతో వణుకుతూ ఒదిగిపోయే
శాంతిని... కిడ్నాప్ చేశారు
ఎవరు చేశారు... ఎందుకు చేశారు...
పట్టుకోండి వాళ్లని
దురహంకారుల్ని... ధృతరాష్ట్ర సంతానాన్ని...
మేం ఉన్నాం- పెద్దన్నలం!
పట్టుకోండి వాళ్లని... పట్టి మాకప్పగించండి...
కూల్చేస్తాం... కాల్చేస్తాం...
పేల్చేస్తాం... ఊదేస్తాం...
వెదకండి ఎక్కడ దాచారో...
నూనె బావుల్లోనా- పేల్చేద్దాం
హిమవన్నగంలోనా- కాల్చేద్దాం
బమియాన్ గుహల్లోనా- కూల్చేద్దాం
థార్ సహారాల్లోనా- ఊదేద్దాం
అరేబియాలో... హిందూలో...
ఎక్కడున్నా పట్టేస్తాం...
పట్టి విడిపిస్తాం... భద్రత కల్పిస్తాం...
శాంతికి శాంతి కలిగిస్తాం!

*- తుర్లపాటి వేంకట భానుమతి*

చేరితే సరిపోయేది... ఈ దరిద్రపు గోల వుండేది కాదు" అని మనసులో బాధపడుతోంది. అరమైలు పొడవున్న వంతెన దాటటానికి ఆరుయుగాలు పడుతున్నట్లుంది... విజిల్స్... అరుపులు... కూతలు... రెండర్థాల సినిమా పాటలు గోలగోలగా...

సుధ తెలివైంది... చదువు మీద శ్రద్ధ వుంది కనుక రాత్రింబవళ్ళు కష్టపడి చదివి- మంచి రాంక్ సంపాదించి పాలిటెక్నిక్‌లో సీటు సంపాదించింది. సుధ చదువులో ఎంత చురుకో మిగతా విషయాలలో అంత మెతక. బిడియం, భయం, పిరికితనం ఎక్కువ. ఎప్పుడు వంటరిగా ఎక్కడికీ వెళ్ళదు. పద్మ ఇదే కాలేజీలో తన క్లాసులోనే చదువుతుండటం తన అదృష్టమనుకుంటుంది. పద్మ కాస్త ధైర్యస్థురాలే. చూట్టానికి గంభీరంగా, రఫ్‌గా కనిపిస్తుంది. మాట తీరు కూడా అలాగే వుంటుంది. వెనక నుంచి దూరదూరంగా వుండి కామెంట్స్ పాస్ చెయ్యటమే తప్ప ఎదురుగా వచ్చి బాయ్స్ పద్మని ఏం అనరు. సుధకి మగపిల్లలంటే భయం. నలుగురైదుగురు స్టూడెంట్స్ గుంపుగా కనిపిస్తే భయపడిపోతుంది. "ఇదిగో ఇలాంటి పరిస్థితి ఎదురౌతుందనే భయం... దేవుడా వీళ్లిలా నా వెంటపడి వేధిస్తున్నారు... ఇప్పుడేం చెయ్యాలి." కన్నీళ్ళొక్కటే తక్కువగా ఎల్లాగో బలహీనపడి తేలిపోతున్న కళ్ళలోకి సత్తువ తెచ్చుకుని వంతెన దాటుతోంది. నిలబెట్టి తిట్టిపొయ్యాలనిపిస్తోంది. మళ్ళీ అంత సాహసం చెయ్యలేకపోతోంది. తను వాళ్ళకు భయపడుతున్నట్టు కనిపెడితే మరింత రెచ్చిపోతారని పైకి బింకంగా తనను కానట్టు తనకేమి పట్టనట్లు తన త్రోవన తను పోవాలని ప్రయత్నిస్తోంది. వంతెన చివరికి వచ్చేసింది... "హమ్మయ్య. ఇక డౌన్‌లోకి వెళ్ళిపోవడమే... వంతెన దిగిపోతే కాస్త జనం కనిపిస్తారు. బాలాజీ సెంటర్ దగ్గరౌతుంది కదా..." ముఖానికి పట్టిన చెమట గాలికి ఆరిపోతోంది. అకస్మాత్తుగా త్రుళ్ళి పడింది... మెడచుట్టూ అల్లుకున్న పల్చని చున్నీ గాలికి పట్టువదిలి పైకి ఎగిరిపోతోంది. "హేయ్... హేయ్..." వెనక నుంచి అరుపులు, నవ్వులు. ఎవడో సైకిల్ వదిలేసి ఎగిరిపోతున్న సుధ చున్నీని దొరకపుచ్చుకుని లాగసాగాడు. ఒక చేత్తో డౌన్‌లోకి పోతున్న సైకిల్ బాలెన్స్ చేసుకుంటూ

మరోచేత్తో... 'ఇడియట్" అంటూ గట్టిగా చున్నీ వాడికి అందకుండా గుండెలమీదకు లాక్కుంటోంది సుధ.

"ఒరేయ్... తిడుతోందిరా... దీని పని చెప్దాం... వదలకురా...!" చాలా దగ్గరగా తాకేంత దగ్గరగా వచ్చేసి చుట్టూ... చేరి "హాయ్... బేబీ... తిడుతున్నావా... తప్పమ్మా" అంటూ వెకిలిగా నవ్వుతూ ఫ్రంట్ బార్ పట్టుకుని సైకిల్ ఆపాలని చూస్తున్నాడొకడు. వేగంగా దిగుతున్న సైకిల్ బాక్ కారియర్ మీదున్న బుక్స్ లాగి పడేసాడొకడు... సుధకు ఏం చెయ్యాలో తోచటం లేదు. భయంతో చిగురుటాకులా కంపించిపోతోంది. సైకిల్ బాలెన్స్ తప్పి పక్కకు ఒరిగిపోయింది.

అకస్మాత్తుగా ఉరుముతున్నట్టు ఒక గొంతు వినిపించింది. "ఎవర్రా అది! అడె...! ఆ పిల్లనేం సేత్తున్నార్రా. వరే చీనూ... బండాపరా.." అంటూ ప్లాటు రిక్షా మీంచి ఒక ఆడ మనిషి దిగి పరుగున సుధ దగ్గరికి వచ్చింది. ఈ అరుపులు వింటూనే అల్లరిమూక "ఎవరో వస్తున్నార్రోయ్... పదండి. పదండి..." అంటూ క్షణంలో మాయమైపోయారు.

"ఏటమ్మా... లే... లెగు..." ఒక బలంగా వున్న గాజుల చెయ్యి సుధని మెల్లగా పైకి లేవదీసింది. అరుపులు, పిచ్చికూతలు, విజిల్స్, సైకిల్ బెల్స్ మోతలో కలిసిపోయి ఫేడయిపోతున్నాయి. వణికిపోతున్న శరీరాన్ని కూడదీసుకుని నిలబడింది సుధ. రిక్షా కుర్రాడు పడిపోయిన సైకిల్ లేపి నిలబెట్టి స్టాండు వేసి... 'దెబ్బలు తగిలాయమ్మా'.. అంటున్నాడు. వంగి పక్కకి తిరిగిపోయిన సైకిల్ హేండిల్ బార్ చేత్తో జాగ్రత్తగా సరిచేస్తూ... మాట పెగల్చుకుని "లే...దు" అంటూనే సైకిల్ కారియర్ వైపు చూసి ఉలిక్కిపడింది. అక్కడ బుక్స్ బాగ్ లేదు. ఖంగారుపడిపోతూ "నా... నా బాగేమైంది... పుస్తకాలేమయ్యాయి? తీసుకుపోయారా... కుందేర్లో విసిరేశారా... అయ్యో... ఇప్పుడేం చెయ్యను." సుధ ముఖమంతా చెమటలు పట్టి- నల్లగా వివర్ణమైపోయింది.

"-ఏటి... ఎతుకుతుండావు... నీ పుత్తకాలా... ఇయిగో ఈడ పడేసిన్రు..." సుధ రోడ్డు వారగా పొదల దగ్గరికి పరుగెత్తింది. అక్కడ నేల మీద తన బుక్స్, కంపాస్, అపరేటస్, టిఫిన్ బాక్స్ చెల్లాచెదురుగా పడివున్నాయి. టిఫిన్ బాక్స్ మూత ఊడిపోయి ఎక్కడో దొర్లిపోయింది. సుధ కళ్ళలోంచి నీళ్ళు ఉబికి వచ్చాయి. "ఛీ... చూడు ఎల్లా చేసారో... నా పుస్తకాలన్నీ" అంది రుద్ధ స్వరంతో. గబ గబ పుస్తకాలు ఏరుకుంటూ... "ఇంద తీసుకో..." ఆ అమ్మాయి తన హాంకీ, పర్సు, పుస్తకాలు ఏరి తీసుకువచ్చి... "ఇదిగో సంచీ ఈడ పడేసిన్రు... దొంగ సచ్చినోళ్ళు... ఈళ్లకిదేం రోగవో..."

"కాలేజీలో సదువుకుంటండావా...?" అంది కూరగాయలమ్మి... మోకాళ్ళ మీద కూర్చుని పుస్తకాలన్నీ జాగ్రత్తగా సంచీలో సర్దుకుంటున్న సుధతో. అవుననట్టు తలూపింది సుధ. అవమానంతో, సిగ్గుతో మనసంతా వికలమైపోయింది. లోపల్నుంచి ఏడుపు తోసుకువస్తోంది. మాట పెగిలి రావటం లేదు. మెదడంతా షాక్ తిన్నట్లు మొద్దుబారి వుంది.

"సా... ఈపాటికేనా... అట్టయిపోనావు... సదూకుంటన్నావు గందా... ధెయిర్రెంగా వుండాల... పొద్దోతోంది జాగరతగా ఇంటికెల్లు. పారిపోయిన్రులే... దొంగ నాయాల్లు... వరే శీనూ... సెంటర్ దాకా కూంత ఎంటుండు పాపం... బిడ్డ బెదిరిపోనాది..." అంటూ సుధ మళ్ళీ సైకిలెక్కి కదిలేవరకూ అక్కడే వుండి కూరగాయల గంప తీసుకుని వెళ్ళిపోయిందా అమ్మాయి.

✦ ✦ ✦

"ఏటి... అడ్డదారిన పోతుండావు. ఆ పిల్ల గాళ్లకి బయపడినావా ఏంది?" మెయిన్ రోడ్ తగలకుండా చుట్టుతిరిగి కాలేజీకి పోతున్న సుధను ఆపి నవ్వుతూ అడిగింది కూరగాయలమ్మి. సుధ సైకిల్ దిగి "అబ్బే... అది... అది" అని గొణిగింది నిజం ఒప్పుకోలేక. "నిన్న నువ్వు నాకు చాలా సాయం చేసావు..." అంది సిగ్గుతో ఎర్రబడిపోయిన ముఖంతో కాస్త నవ్వు తెచ్చుకుని.

"నన్ను సుబ్బులంటారు. ఇల్లిల్లు తిరిగి కూరలు, పళ్ళు అమ్ముకుంటాను. బయపడి పారిపోతే ఎంటపడి తరుముతారు... నిబ్బరంగా నిలబడి ధెయిర్రంగా నిలదియ్యాల... అవూ... మరీ పెందలకాడ్నే ఎడుతున్నావేటి కాలేజీకి?" అంది బరువైన తాజా కూరగాయల తట్ట బరువుకు లయగా నడుస్తూ సుబ్బులు. చివరి మాటలకి సుధ ముఖం

ఎర్రబడిపోయింది. వాళ్ళకి భయపడి ఒక గంట ముందుగా కాలేజీకి బయల్దేరింది- దూరమైనా వాళ్ళెవరూ ఎదురవరన్న ధైర్యంతో సందులు, గొందులు వెంటపడింది కాని అనుకోకుండా పళ్ళమ్మి సుబ్బులు తటస్థపడింది. అది కాస్త ఇబ్బందిగానే వుంది. తను మరీ పిరికిపందనుకుంటుంది సుబ్బులు. "ఇక్కడ కాలనీలో నా స్నేహితులున్నారు వాళ్ళతో కలిసివెళ్దామని ఇటొచ్చాను..." అంది తడబడుతూ.

"ఒక్కత్తివీ ఎల్లలేవెట్టా... పద్దాక ఎవురు తోడుంటార్నీకు...!? ఈ గొందుల్ల మాతరం పోకిరీ కుఱ్ఱాళ్ళుండరనేటి?! మీ నానకి సెప్పలేకపోయావా... ఆల్ల పని పట్టేవోడు... మల్లా నీ వెయిపు రాకుండాని!"

గాస్ గోడౌన్ సెంటర్ దగ్గర ఎవరో కూరల కోసం సుబ్బుల్ని పిలిచారు. సుధ తను ఆగకుండా నిదానంగా సైకిల్ తొక్కుతోంది. "సుబ్బులు చెప్పిందీ రైటే... ఇక్కడ మాత్రం వుండరని నమ్మకమేముంది... నడిరోడ్డు మీదే ఎవరి భయం లేకుండా ఏడిపిస్తున్నారు. ఈ సందుల్లో మరీ గోల చెయ్యరూ? నిన్న జరిగింది నాన్నగారికి చెప్తే బాగుండేదేమో... ఏమంటారోనని చెప్పలేకపోయింది. అమ్మ మొదట్నించి... "అంత దూరం ఆ కాలేజీలో వద్దు. గర్ల్స్ కాలేజీలో చేర్చండి... ఇంటికీ దగ్గర. ఆడ పిల్లల్తో హాయిగా చదువుకుంటుంది' అంటూనే వుంది. అమ్మ భయాన్ని నాన్న కొట్టిపడేశారు. తనకు కావల్సిన కోర్సులో చేర్చారు. తన తెలివి, చురుకుతనం, ధైర్యం మీద నాన్నగారికి చాలా నమ్మకం! ఇప్పుడు జరిగింది చెప్తే అమ్మ గోల చేస్తుంది చదువు ఆపించినా ఆపించేస్తుంది. రోజూ ఇండైరెక్టుగా 'జాగ్రత్త... జాగ్రత్త... అది మగపిల్లల కాలేజీ... అందరూ మంచి వాళ్ళుండరు..." అని హెచ్చరిస్తూనే వుంది. వాళ్ళు అల్లరి పెడుతున్నారని తన చదువు పాడు చేసుకోలేదు కదా... ఇంక ఒకవేళ అక్కడే కంటిన్యూ చేయించినా రోజూ అమ్మ భయపడుతూ గొడవ చేస్తూ వుంటుంది. అందుకే చెప్పలేదు. "ఏమిటట్లా వున్నావు... ఏం జరిగింది" అని తన ముఖం చూసి అమ్మ ఒకటికి పదిసార్లు అడిగినా... "ఏం లేదమ్మా... తలనెప్పిగా వుందంతే..." అని చెప్పి తప్పించుకుంది. అమ్మకే కాదు ఈ విషయం ఎవరికీ చెప్పకూడదనుకుంది సుధ.

కూరగాయులమ్మికి వరనగా బేరాలు తగలటంతో గోడౌన్ దరిదాపుల్లోనే తట్ట దించుకుంటూ ఎత్తుకుంటూ వెనకబడిపోయింది. ఓంకారక్షేత్రం దాటేసరికి మెయిన్ రోడ్డంతా కాలేజ్ స్టూడెంట్స్‌తో స్టాఫుతో రద్దీగా వుంది. సైకిళ్ళ మీద ఇద్దరేసి ముగ్గురేసి అబ్బాయిలు గోలగోలగా- అల్లరి చేసుకుంటూ లెక్చరర్ ఎవరన్నా కనపడితే ఠక్కున బుద్ధిమంతులైపోయి 'నమస్తే సార్' అని విష్ చేస్తూ అమాయకంగా సిన్సియర్ స్టూడెంట్స్ ఫోజు కట్ చేస్తున్నారు. "దొంగ వెధవలు... అన్నీ దొంగ వేషాలు..." సుధ మెయిన్ రోడ్ మీదకి వచ్చేసి ఆడపిల్లల మధ్య ఇరుక్కుంది. కాలేజీ టైంలో ఏమీ అల్లరి చెయ్యరు. కాలేజీ అయిపోయి ఇంటికి వెళ్ళే సమయంలోనే భయం లేకుండా రెచ్చిపోతారు మందలించే వాళ్ళెవరూ వుండరని ధైర్యం. కాలేజీ టైంకి అరగంట ముందే వచ్చేసి కాస్త రిలీఫ్‌గా లేడీస్ వెయిటింగ్ రూంలో కూర్చుంది.

సాయంత్రం మళ్ళీ సమస్య గుర్తు వచ్చింది. ఏం చెయ్యాలి. రూట్ మార్చి ఉదయం వచ్చిన రూట్లో వెళ్ళాలా... ధైర్యం చేసి మెయిన్ రూట్‌లోనే వెళ్ళాలా. చుట్టు తిరుగుడే కాకుండా అది మరీ లోన్లీ ఏరియా. గోడౌన్ దాటాక ఓ ఫర్లాంగు దూరం వరకూ అక్కడోటి అక్కడోటి గుడిసెలు తప్ప జనసంచారం పగలే వుండదు. ఇక చీకటి పడేవేళకి మరీ నిర్జనంగా బావురుమంటూ వుంటుంది. అటు, ఇటు, కనుచూపు మేర ఆకుమళ్ళు- కనకాంబరం మరువాల మళ్ళు తప్ప ఏమీ కనపడదు. 'వీళ్ళెవర'న్నా తను ఆ రూట్లో వెళ్ళటం కనిపెట్టి ఫాలో అవుతే- మరీ లోకువ కట్టేస్తారు.

ఆలోచిస్తూనే యాంత్రికంగా నారాయణ టీ స్టాల్ దాటి ఓంకార క్షేత్రం సెంటర్ కూడా దాటేసి మెయిన్ రోడ్డు మీదకు వచ్చేసింది. కొంత దూరం వరకూ అక్కడ జన సంచారం బాగానే వుంటుంది. సమస్యంతా కుందేరు దగ్గరే... 'దేవుడి దయ వల్ల కోర్టు వాళ్ళు కాని బ్యాంక్ వాళ్ళు కాని- జూనియర్ కాలేజి స్టాఫ్ కాని... స్టూడెంట్స్ కాదు ఎందుకంటే వాళ్ళు కోతిమూకే. అక్కడ వుంటే బాగుండును' అనుకుని బితుకు బితుకుమంటున్న గుండెలతో అధైర్యంగా సైకిల్ తొక్కుకుంటూ పోతోంది.

'వస్తోందిరోయ్.. వస్తోంది...'

...'పొద్దున్న కనపడలేదేం బేబీ-'

'రూట్ మార్చిందిరోయ్...'

'కొత్తపేట రూట్‌లో వచ్చింది... మనం కనిపెట్టలేమనుకుంది...'

'మరి ఇప్పుడేమిటి... ఇలా వస్తోంది'

'ఆ త్రోవే బాగుంటుంది కదూ' 'ఎవరూ వుండరు... హాయిగా ఎంజాయ్ చెయ్యొచ్చు-'

నాలుగు వైపుల్నించి నలుగురు కమ్ముకొచ్చారు... సుధ బిత్తరపోయింది. భయంతో కాళ్ళు వణికి సైకిల్ కదలటం లేదు. తన్నే ఇలా పట్టుకుని వేధిస్తున్నారేమిటి...?

'నిన్నెవత్తో లేబర్ వచ్చిందిరోయ్. ఈవాళ కూడా అది రాదు కదా..'

'ఎస్కార్టా...' "సెక్యూరిటీ అరేంజ్ చేసుకుందేమో... యువరాణీ" వ్యంగ్యంగా నవ్వులు...

సైకిల్ హేండిల్ బార్ పట్టుకుని ఆపేశారు. మీదిమీదికి వస్తూ పిచ్చిపిచ్చిగా వాగుతున్నారు. ఒకడు చెయ్యి పట్టుకు లాగాలని ప్రయత్నిస్తున్నాడు. బాగ్ తీసి క్రింద పడేశాడొకడు... కన్నీళ్ళ పర్యంతమై తప్పించుకోవాలని ప్రయత్నిస్తోంది. అదృష్టవశాత్తు అట్నించి వాడ్రేవు వైపు వెళ్ళే సిటీ బస్ వస్తున్న మోత వినిపించింది. అక్కడ బస్టాప్ కూడా వుంది.

"ఛ... ఇదేవిట్రా... బస్సిప్పుడు వస్తోంది..."

'పదండి... పదండి...' బస్సు వచ్చి స్టాప్‌లో ఆగేనరికే రెప్పపాటులో అల్లరిమూక అంతర్ధానమైపోయింది. సుధ బ్రతుకు జీవుడాని దేవుడికి దణ్ణం పెట్టుకుంది. క్రింద పడిపోయిన బాగ్ తీసుకుని బరువుగా ఊపిరి తీసుకుంది. సైకిల్ చక్రంలో గాలి తీసేశారు. చక్రం నేలనంటుకుని నువ్వే నన్ను తీసుకెళ్ళమని మొరాయించింది. "ఛీ...ఛీ... ఏమిటి రోజూ ఈ ఖర్మ...! బాలాజి సెంటర్ దాకా నడిపించుకెళ్ళి గాలి కొట్టించుకోవాలి" ఉసూరుమంది ప్రాణం. బస్సు వెళ్ళిపోయింది. ఇద్దరు ముగ్గురు దిగి కాలిబాటలోంచి వెళ్ళిపోయారు.

"హాయ్... బేబీ... మేం ఇక్కడే వున్నాం. డోంట్ వర్రీ..." వెళ్ళిపోయామనుకుందిరోయ్... పాపం..." మళ్ళీ అధాటున పిచ్చివాగుడు... వెకిలి నవ్వులతో చుట్టుముడుతున్న అల్లరి మూకను చూసి అవాక్కైంది. రెండర్థాల పాటలు... విజిల్స్.... వెకిలి వాగుడు...

అకస్మాత్తుగా ఎవరూ ఊహించని విధంగా "ఎవట్రా... అది... ఆ పిల్లని అటకాయిత్తన్నారు...! వసే రావులూ... మంగమ్మా... వరే యానాదిగా బేగి ఇట్రాండ్రా. ఈ ఎదవ నాయాళ్ళు ఆడపిల్లల్ని ఎట్టా ఏడిపిత్తన్నారో సూడండీ... రండీ..." పెద్దగా అరుస్తూ మధ్యలో కొచ్చింది పరుగున సుబ్బులు. వెంటనే 'ఎవుడ్రా అదీ... వరే పోలీసయ్యని పిలవరా ఏగిరం టేసినుకెళ్ళి... ఆళ్ళని పోనీమాకండి నచ్చినోళ్ళు... అప్పసెల్లెల్లు లేరంట్రా ఎదవనాయాల్లారా... ఆడపిల్లలంటే అంత అలుసుగా వుందంట్రా ఎదవల్లారా..." అంటూ పది మంది పోగై కుర్రాళ్ళని కదలనివ్వకుండా చుట్టుముట్టి దేహశుద్ధి చేస్తున్నారు. ఈ హఠాత్పరిణామానికి నిశ్చేష్టురాలైంది సుధ. ఈలోగా ఓ కుర్రాడు దగ్గరలో వున్న టూ టౌన్ కానిస్టేబిల్‌ని వెంటపెట్టుకొచ్చాడు. ఏదో ఆడపిల్లలే ఎవరికీ చెప్పుకోలేదు... అల్లరి పెట్టి ఆనందిద్దామనుకున్న ఈవ్ టీజర్స్ ఊహించని ఎదురుదాడికి బిత్తరపోయారు. తప్పించుకునే వీలులేక జనం చేతిలో తన్నులు తిని, పోలీసుస్టేషన్ కెళ్ళి పడ్డారు. కూడా వెళ్ళి సుధ చేత కంప్లయింట్ చేయించి కానీ వదల్లేదు సుబ్బులు.

"నాకు చాలా సాయం చేశావు. చాలా థాంక్స్... నువ్వు ధైర్యం చెప్పకపోతే..." సుధ తడబడుతూ కృతజ్ఞత చెప్పబోయింది. "ఆగు... ధెయిర్రెం ఓరో సెప్తే వచ్చేది కాదు బుల్లా... గుండెల్లోంచి సాయంగా రావాల...! బుర్రలో తెలివి, సదువూ వుంటే సాలదు గుండె నిండ ధెయిర్రం వుండాల! బెదురు గొడ్డులా పారిపోకూడదు. నీకు జరిగే అన్యాయాన్ని ధయిర్రంగా ఎదిరించాల. నువ్వసలే ఆడపిల్లవి. ఆకతాయి ఎదవనాయాళ్ళ నుంచి నిన్ను నువ్వు రచ్చించుకోటం ముందు నేర్చుకో. సదువుతో పాటు గుండె ధెయిర్రం కూడా ఆడపిల్లకు గావాలి. అదే వుంటే ఎప్పుడూ- ఎవుడూ నీ జోలికి రాలేడు. అది లేకుంటే పుత్తకాలెన్ని సదివినా నాబం లేదు..." అమ్మాయి జీవితానికి అతి ముఖ్యమైన పాఠాన్ని కొత్తగా, అబ్బురంగా వింటూ ఆట్టే నిలబడిపోయిన సుధను నవ్వుతూ చూసి... "ఏటట్టా నిలబడిపోయినావు... ధెయిర్రంగా వుండు బుల్లా ఎవుడూ నీ ఎదర నిలబడలేడు, పోయిరా పొద్దోయింది..." అంటూ రోడ్డు దిగువన వున్న గుడిసెల వైపు వెళ్ళిపోయింది సుబ్బులు. ●